క్లుప్తంగా

మున్సిపల్ డీఈగా మధుసూదనరావు



రేపల్లె రూరల్: మున్సిపల్ డీఈగా ఓలేటి మధుసూదనరావు గురువారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. మాచర్ల నుంచి సాధారణ బదిలీపై రేపల్లె విచ్చేశారు. రేపల్లె డీఈగా విధులు నిర్వర్తిస్తున్న శివరామకృష్ణ తెనాలికి బదిలీపై వెళ్ళారు. ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన మధుసూదనరావుకు కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ పాలక వర్గం, పట్టణ ప్రజల సహకారంతో మున్సిపాలిటీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని పేర్కొన్నారు.

మృతుని కుటుంబానికి గణేశ్ పరామర్శ



చెరుకుపల్లి: మండలంలోని ఆళ్లవారిపాలెంకు చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు గాలిమోటి సెవిరి గురువారం మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ సెవిరి మృతదేహాన్ని సందర్శించి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు. గణేష్ వెంట వైఎస్సార్ నాయకులు కాశీ ప్రభాకరరావు, రాజశేఖర్, సాంబశివరావు, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

నేడు సూపర్ లగ్జరీ సర్వీసులు ప్రారంభం

రేపల్లె రూరల్: పట్టణంలోని ఆర్టీసీ డిపోలో ఈనెల 4 నుంచి హైదరాబాద్ బీహెచ్ఈఎల్‌కు కొత్తగా సూపర్ లగ్జరీ బస్సులను ప్రారంభిస్తున్నట్లు ఆర్టీసీ డిపో ఇన్‌చార్జ్ మేనేజర్ ఎ.రాజశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రేపల్లె నుంచి నగరం, చెరుకుపల్లి, తెనాలి, విజయవాడల మీదుగా ప్రతి రోజూ రాత్రి 7.30 గంటలకు బీహెచ్ఈఎల్‌కు సూపర్ లగ్జరీ సర్వీసులు నడుపనున్నట్టు పేర్కొన్నారు. బీహెచ్ఈఎల్ నుంచి ప్రతి రోజూ రాత్రి 8.15 గంటలకు సూపర్ లగ్జరీ బస్సు బయలుదేరి రేపల్లె వస్తుందని చెప్పారు.

5, 6 తేదీలలో విద్యార్థుల సేవలు నిలుపుదల

ఏపీఎస్ ఆర్టీసీకి సంబంధించిన వెబ్‌సైట్‌ను ఆధునికీకరించటంలో భాగంగా ఈనెల 5, 6 తేదీలలో బస్‌పాస్‌లు, విద్యార్థులకు సంబంధించిన వివిధ రకాల ఆన్‌లైన్ సేవలకు అంతరాయం కలుగుతుందని డిపో ఇన్‌చార్జ్ మేనేజర్ రాజశేఖర్ తెలిపారు. 7 నుంచి డిపోలోని కౌంటర్లలో యథావిధిగా బస్‌పాస్‌లు, ఆన్‌లైన్ సేవలు నడపబడుతాయని తెలిపారు.

ఉపాధి పనుల కోసం గ్రామసభలు

వేమూరు: కూలీలకు ఉపాధి పనులు కల్పించేందుకు గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహిస్తున్నట్టు ఉపాధి హామీ పథకం అసిస్టెంట్ ప్రాజెక్ట్ అధికారి సత్య కృష్ణ తెలిపారు. వేమూరు మండలంలోని వేమూరు, అబ్బనగూడవల్లి బలిజేపల్లి, చదలవాడ, కుచ్చెళ్లపాడు, కాకర్లమూడి, బూతుమల్లి, పెనుమర్రు, కోడిపర్రు, పెరవలి గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించారు. ఉపాధి పనులు గుర్తించారు.

అర్హులందరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలి

ఇన్‌చార్జ్ ఆర్డీఓ లక్ష్మీకుమారి

రేపల్లె రూరల్: అర్హులందరూ ఓటు హక్కు కోసం నమోదు చేసుకోవాలని డెప్యూటీ కలెక్టర్, రేపల్లె ఇన్‌చార్జ్ ఆర్డీవో లక్ష్మీకుమారి చెప్పారు. పట్టణంలోని రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో గురువారం వివిధ రాజకీయ పార్టీలు, అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ తమ సమీపంలోని పోలింగ్ కేంద్రాలలో ఓటు హక్కు పొందేందుకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఓటు హక్కు దరఖాస్తులు, చేర్పులు, మార్పులు, తొలగింపులపై వచ్చిన అభ్యంతరాలపై అధికారులు నిష్పక్షపాతంగా విచారణ చేస్తారని చెప్పారు. వీటిపై రాజకీయపార్టీల నాయకులు సలహాలు, సూచనలు అందించాలని కోరారు. సమావేశంలో తహసీల్దార్ శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

మద్యం షాపులకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు

వేమూరు: మద్యం షాపులకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఎక్సైజ్ సీఐ ఎ.రవి కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ మద్యం షాపుల టెండర్లకు సర్కారు నోటిఫికేషన్ విడుదల చేసిందని పేర్కొన్నారు. తమ పరిధిలో 12 షాపులకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్టు వెల్లడించారు. ఈనెల 1 నుంచి 9 వరకు దరఖాస్తుకు గడువు ఉందని వివరించారు. ఈనెల 11న బాపట్ల ఎస్ఎస్ఆర్ కల్యాణ మండపంలో ఉదయం 8 గంటలకు కలెక్టర్ సమక్షంలో లాటరీ పద్ధతిన టెండర్లు ఖరారు చేయనున్నట్టు వెల్లడించారు.



విద్యుద్దీపకాంతుల్లో బాపట్ల రామానగర్‌లోని ప్రసన్నదుర్గాభవానీ ఆలయం



కర్లపాలెం మండలం ఎంవీరాజుపాలెంలో పూజలు అందుకుంటున్న కనక దుర్గమ్మ



రేపల్లెలో బతుకమ్మను ఊరేగింపుగా తీసుకెళ్తున్న మహిళలు



రేపల్లెలో బూరుగులమ్మకు ప్రత్యేక పూజలు


'దేవీ'ప్యమానం

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం అంగరంగవైభవంగా ప్రారంభమయ్యాయి. రేపల్లె, వేమూరు, బాపట్ల నియోజకవర్గాల్లో పలు చోట్ల చలువ పందిళ్లు వెలిశాయి. ఊరూవాడా దసరా కాంతులతో శోభిల్లుతున్నాయి. ఆలయాల్లో అమ్మవార్లు విశేష అలంకరణల్లో భక్తులను కటాక్షిస్తున్నారు. గురువారం చాలా ఆలయాల్లో అమ్మవారు బాలాత్రిపురసుందరీదేవిగా సాక్షాత్కరించారు. అమ్మ దివ్యమంగళ స్వరూపాన్ని తిలకించి భక్తులు పులకించారు. మహిళలు కుంకుమ పూజలు చేశారు. ఇదిలా ఉంటే రేపల్లెలో ఆర్యవైశ్య మహిళల ఆధ్వర్యంలో గురువారం బతుకమ్మ పూజలు చేశారు. తొలుత బతుకమ్మ ఊరేగింపు నిర్వహించారు. అమ్మవారికి పువ్వులు, పండ్లు, పసుపు, కుంకుమ, నూతన వస్త్రాలతో కూడిన సారెను సమర్పించారు. బతుకమ్మ గీతాలను ఆలపించారు.

– బాపట్ల టౌన్/కర్లపాలెం/భట్టిప్రోలు/కొల్లూరు/రేపల్లెరూరల్/నగరం



ప్రత్యేక అలంకారంలో ముత్యాలమ్మ, కట్లమ్మ, మహాలక్ష్మమ్మ అమ్మవార్లు



కొల్లూరు లాక్‌సెంటర్ కనకదుర్గమ్మ ఆలయంలో..



బాపట్ల కోనప్రభాకర్ కళాక్షేత్రంలో..



బాపట్ల ముత్తాయపాలెంలోని రామాలయంలో ప్రత్యేక అలంకరణ



రేపల్లె మండలం చోడాయపాలెం చౌడేశ్వరస్వామి గుడిలో..



నగరం మండలం కొలగానివారిపాలెంలో..



రేపల్లె ఇసుకపల్లిలో భ్రమరాంబ అలంకారం



కర్లపాలెం మండలం నల్లమోతువారిపాలెంలో..



ప్రత్యేక అలంకరణలో చందోలు బండ్లమ్మ

బదిలీపై వెళ్తున్న ఎంపీడీఓకు సన్మానం



ఎంపీడీఓను సన్మానిస్తున్న దృశ్యం

భట్టిప్రోలు: భట్టిప్రోలు ఎంపీడీఓగా పని చేస్తూ పొన్నూరు బదిలీపై వెళ్తున్న గుమ్మా చంద్రశేఖరరావును గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సన్మానించారు. ఎంపీపీ దావూరి వెంకట లలితకుమారి ఆధ్వర్యంలో కార్యాలయ సిబ్బంది, వివిధ శాఖాధికారులు సత్కరించారు. కార్యక్రమంలో హౌసింగ్, పంచాయతీరాజ్ ఏఈలు రావూరి సౌమ్య, శేతు రామచంద్రరరావు, ఏఓ జలజ, టెక్నికల్ అసిస్టెంట్ సుధీర్, తదితరులు పాల్గొన్నారు.

సిలబస్ తగ్గించాలని వినతి

మారిన 10వ తరగతి సోషల్ స్టడీస్ సిలబస్‌లో పాఠ్యాంశాలు ఎక్కువగా ఉన్నందున తగ్గించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంఘిక శాస్త్ర టీచర్స్ ఫోరం (ఏపీఎస్ఎస్‌టీఎఫ్)రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు గుర్రం మురళీమోహన్ బుధవారం మంగళగిరిలోని రాష్ట్ర విద్యా శాఖ కమిషనర్ కార్యాలయంలో జాయింట్ డైరెక్టర్ ఎం.వెంకట కృష్ణారెడ్డిని కలిసి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ఎస్‌కే సైద్ ఉన్నీస్సా బేగం, ఎం. శేషుబాబు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి విద్యార్థులకు ప్రత్యేక శిబిరం

రోటరీక్లబ్ అధ్యక్షులు ఉపేంద్రగుప్త



కరపత్రాలను విడుదల చేస్తున్న రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు

బాపట్లటౌన్: విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంచేందుకు తమ క్లబ్‌లో ఈనెల 4 నుంచి 10 వరకు ప్రత్యేక శిబిరం నిర్వహిస్తున్నట్టు రోటరీక్లబ్ అధ్యక్షులు ఉపేంద్రగుప్త తెలిపారు. రోటరీక్లబ్, స్టూడెంట్స్ ఇంటలెక్చువల్ ఫోరం సంయుక్త ఆధ్వర్యంలో 'ఈ తరంలో మేము ప్రత్యేకం' పేరుతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు వివరించారు. దసరా సెలవుల్లో విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంచడమే ఈ కార్యక్రమ ధ్యేయమన్నారు. ప్రముఖ అబ్జర్వేషనల్ సైకాలజిస్ట్ పిన్నిబోయిన శ్రీమన్నారాయణ పర్యవేక్షణలో శిబిరాన్ని నిర్వహిస్తామని, డ్యాన్స్ శిక్షణ ఇస్తామని వెల్లడించారు. పర్సనాలిటీ డెవలప్‌మెంట్‌పై శిక్షణ ఇస్తామని వివరించారు. శిక్షణ అనంతరం విద్యార్థులకు మెటీరియల్, సర్టిఫికెట్‌ను అందజేస్తామని చెప్పారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ కార్యదర్శి వేజెండ్ల శ్రీనివాసరావు, సభ్యులు ఏలూరి హరిబాబు, కొల్లా శ్రీనివాసరావు, బుర్లె రామ సుబ్బారావు, గోపాళం రమేష్ బాబు ,తాళ్లూరి మల్లిఖార్జునరావు, కొత్త ఆంజనేయ వరప్రసాద్ పాల్గొన్నారు.

కొల్లూరులో పూరిల్లు, దుకాణం దగ్ధం



కొల్లూరు : అగ్ని ప్రమాదం సంభవించి ఓ పూరిల్లు, అందులో నిర్వహిస్తున్న దుకాణం దగ్ధమైన ఘటన కొల్లూరు ఎస్సీ ప్రాంతంలోని బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద జరిగింది. బాధితులు, స్థానికుల కథనం మేరకు.. దోనేపూడి సరోజిని కాలువ కట్ట వెంబడి పూరిల్లు వేసుకొని అందులోనే దుకాణంతోపాటు, చిన్నపాటి హోటల్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తోంది. గురువారం మధ్యాహ్నం హోటల్‌లో అల్పాహారం తయారు చేసేందుకు గ్యాస్ పొయ్యిపై వంట చేస్తున్న సమయంలో సిలిండర్ వద్ద నుంచి ఒక్కసారిగా మంటలు ఎగసిపడి దుకాణం నిర్వహిస్తున్న ప్రాంతంలో పూరింటికి అంటుకున్నాయి. మంటలు ఉన్న పళంగా ఇల్లు మొత్తం చుట్టుముట్టడంతో సరోజిని మంటల తాకిడి నుంచి తప్పించుకునే క్రమంలో స్వల్పంగా గాయపడింది. గ్యాస్ సిలిండర్ పేలుతుందని ముందే ప్రజలు అప్రమత్తమై ఆ ప్రాంతం నుంచి దూరంగా వెళ్లారు. ఆ తర్వాత సిలిండర్ పేలింది. దీంతో పూరిల్లు, దుకాణం పూర్తిగా దగ్ధమైంది. కుటుంబ సభ్యులు కట్టుబట్టలతో మిగిలారు. సుమారు రూ.1.50 లక్షల వరకు నష్టం వాటిల్లి ఉండవచ్చునని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కౌలురైతుల సమస్యలపై 8న 'ఛలో విజయవాడ'



పంటపొలాల్లో రైతులతో కలిసి కరపత్రం ఆవిష్కరించిన బైరగాని

తెనాలి: కౌలు రైతుల సమస్యల పరిష్కారానికై అక్టోబర్ 8న విజయవాడలో నిర్వహించనున్న సదస్సును జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బైరగాని శ్రీనివాసరావు కోరారు. గురువారం తెనాలిలోని గోలి డొంక పొలాల వద్ద రైతులతో కలసి ఛలో విజయవాడ కరపత్రాన్ని విడుదల చేశారు. ఇటీవల వచ్చిన కృష్ణానది, బుడమేరు వరదలు, అధిక వర్షాలు కారణంగా కృష్ణా పరీవాహక ప్రాంతాల్లో పంటలన్నీ జలమయ్యాయని, కంద, పసుపు, నిమ్మ, అరటి లాంటి వాణిజ్య పంటలకు రైతులు రూ.లక్షల్లో పెట్టుబడి పెట్టారని తెలిపారు. నష్టపోయిన రైతులకు పెట్టుబడితో పాటు కౌలు అదనంగా చెల్లించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. నీట మునిగిన పంటల నుండి ఒక్క వడ్ల గింజ గాని, దుంపగానీ చేతికొచ్చే పరిస్థితి లేదని శ్రీనివాసరావు చెప్పారు. ఎకరా వరి పంటకు రూ 10. వేలు, వాణిజ్య పంటలకు రూ. 14 వేలు నష్టం నష్టపరిహారం ప్రకటించినప్పటికీ ముఖ్యమంత్రి ప్రకటన వట్టి నీటిబుడగలే అన్నారు. రైతులకు ఇస్తామన్న నష్టపరిహారం పూర్తిస్థాయిలో అమలు జరగకపోవడంతో నష్టపరిహారం అందని కౌలు రైతులతో గ్రామాలవారీగా అర్జీలు తీసుకుని విజయవాడలోని మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రానికి తరలిరావాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. వీరితో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివ సాంబిరెడ్డి, రైతులు పొట్లూరి రామయ్య, తులిమిల్లి నాగేశ్వరరావు, జెట్టి శ్రీను, కల్లూరి శ్రీను, మేకల చిట్టిబాబు తదితరులు ఉన్నారు.

వ్యవసాయ సహాయకులు అందుబాటులో ఉండాలి



రేపల్లె రూరల్: సాగులో రైతులు అధిక దిగుబడులు సాధించేలా వ్యవసాయ సహాయకులు అందుబాటులో ఉండాలని మండల వ్యవసాయ అధికారి ఆర్.విజయ్‌బాబు తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఉప్పూడి, గుడ్డికాయలంక గ్రామాలలో గురువారం క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించి రైతులకు, వ్యవసాయ సహాయకులకు సూచనలు చేశారు. సేద్యంలో పాటించాల్సిన మెలకువలను వివరించారు. ఆయన వెంట వెటర్నరీ డాక్టర్ పుప్పాల ప్రవీణ్, వెటర్నరీ అసిస్టెంట్ సత్యశ్రీ, ఏఈవో తేజస్విని, విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్‌లు షేక్ ఆషా, బేబీ సరోజని, అభ్యుదయ రైతులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఇసుక కొరతపై తెనాలిలో సీఐటీయూ ధర్నా



తెనాలి: ఇసుక కొరతపై ప్రభుత్వం దృష్టిని సారించి అందుబాటులో ఉండేలా చూడాలని కోరుతూ శుక్రవారం ఉదయం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట జరిగే ధర్నాను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకులు కేబీ ప్రసాద్ కోరారు. సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక గాంధీచౌక్‌లో గురువారం ఆయన భవన నిర్మాణ కార్మికుల నుద్దేశించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వానికి ముందుచూపు లేనందు వల్లనే ఇసుకకు కొరత ఏర్పడి వందలాది మంది అసంఘటిత కార్మికులు పని లేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. తెనాలి, పరిసర గ్రామాల్నుంచి ఛార్జీలు పెట్టుకుని తెనాలి వస్తున్న కార్మికులు, మహిళా కార్మికులు పనుల్లేకపోవటంతో తిరిగి వెళుతున్నారని చెప్పారు. మరోవైపు అన్నిరకాల నిత్యావసర సరుకుల ధరలు పెరుగుతూ, కార్మిక కుటుంబాలు వీధిన పడే పరిస్థితి దాపురించిందని చెప్పారు. సంఘ నాయకులు షేక్ ఫకీర్ అహ్మద్, ఆర్.శ్రీనివాసరావు, జి.గోపాలం, షేక్ జానిమేస్త్రీ, షేక్ కరిముల్లా, బి.కృష్ణయ్య, ఎంఎస్ నాని, టి.నగేష్‌బాబు, ఎం.శివరామకృష్ణ, కె.రాంబాబు పాల్గొన్నారు. సంఘ గౌరవాధ్యక్షుడు షేక్ హుస్సేన్‌వలి అధ్యక్షత వహించారు.

సమస్యల పరిష్కారం కోసమే గ్రామసభలు



భట్టిప్రోలులో నిర్వహించిన గ్రామ సభలో పాల్గొన్న సర్పంచ్ రవి కిరణ్మయి



ఐలవరంలో పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బందిని సన్మానిస్తున్న దృశ్యం

భట్టిప్రోలు: గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసమే గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు భట్టిప్రోలు సర్పంచ్ దారా రవికిరణ్మయి అన్నారు. గురువారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో మన పంచాయతీ–మన సాధికారతలో భాగంగా గ్రామ సభ జరిగింది. సర్పంచ్ రవికిరణ్మయి మాట్లాడుతూ గ్రామంలో ప్రతి ఒక్కరికి పనులు కల్పించి ఉపాధితో జీవనోపాధి కల్పించడం ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు సమస్యలను ఏకరువు పెట్టారు. విఠలేశ్వరస్వామి కాలనీలో ముంపు కష్టాలను వివరించారు. దీనికి పంచాయతీ కార్యదర్శి కోట శ్రీనివాసరావు సమాధానం చెప్పలేక దాటవేశారు. భట్టిప్రోలు మండలం ఐలవరం గ్రామ సచివాలయంలో గురువారం గ్రామ సభ నిర్వహించారు. పారిశుద్ధ్య సిబ్బందిని సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ మాచర్ల కోటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి గోలి శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ కర్రా జయశ్రీ, పంచాయతీ వార్డు సభ్యులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే జీవితం అంధకారమే

పట్టణ సీఐ అహ్మద్ జానీ



సమావేశంలో మాట్లాడుతున్న పట్టణ సీఐ అహ్మద్‌జానీ

బాపట్లటౌన్: ర్యాగింగ్‌కు పాల్పడితే జీవితం అంధకారమేనని పట్టణ సీఐ అహ్మద్‌జానీ తెలిపారు. వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడితే జరిగే పరిణామాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణ సీఐ అహ్మద్‌జానీ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు బాగుండాలంటే ర్యాగింగ్ జోలికి వెళ్లకుండా ఉండాలన్నారు. ప్రముఖ అడ్వకేట్ ఆర్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సీనియర్లు, జూనియర్లకు గైడ్‌గా ఉండాలన్నారు. జూనియర్లపై అసభ్యకరంగా ప్రవర్తిస్తే కఠిన సెక్షన్ల కింద జైలుజీవితాన్ని గడపాల్సి వస్తుందన్నారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ డి. స్మిత్ మాట్లాడుతూ కళాశాలలో ర్యాగింగ్ కమిటీ ఏర్పాటుచేశామని, కమిటీ ఫోన్ నంబర్లు కాలేజీలు అన్ని చోట్ల డిస్‌ప్లే చేశామన్నారు. కళాశాలలో ఫిర్యాదుల బాక్స్‌లను కూడా ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కేవీఎస్ రామిరెడ్డి, డాక్టర్ జి.రవిబాబు, డాక్టర్ బి.రాజ్ కిరణ్, డాక్టర్ డి.విజయ్ కుమార్, డాక్టర్ కె.కృపావతి, డాక్టర్ కె.లావణ్య పాల్గొన్నారు.

విజ్ఞాన్‌లో 30ఎమ్ జీనోమిక్స్ సెంటర్ ప్రారంభం

చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో హైదరాబాద్‌లోని 30ఎమ్ జీనోమిక్స్ స్టార్టప్ కంపెనీ తన సెంటర్‌ను గురువారం ప్రారంభించిందని వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్ తెలిపారు. వైస్ చాన్స్‌లర్ 'మినీ డీఎన్‌ఏ ల్యాబ్' సెంటర్‌ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ప్రపంచ మానవాళిలో ఎవరైనా ఒకే రోగంతో బాధపడుతున్న వివిధ రకాల వ్యక్తులకు ఒకేరకమైన వైద్యం సరిపోదని, వారి డీఎన్‌ఏల ఆధారంగా పర్సనలైజ్డ్ వైద్యం అవసరమన్నారు. అందుకనుగుణంగా 30ఎమ్ జీనోమిక్స్ స్టార్టప్ కంపెనీ పర్సనలైజ్డ్ మెడిసిన్‌లో భాగంగా ఫార్మకోజెనిటిక్స్ అప్రోచ్ ద్వారా ఔషధానికి సంబంధించిన డోస్‌లను ముందుగానే గుర్తించడం జరుగుతుందన్నారు. భవిష్యత్‌లో బట్టతలకు గురయ్యే అవకాశం ఉందో వారిని కూడా గుర్తించవచ్చునన్నారు. ఈ కార్డియక్ స్క్రీనింగ్ టెస్ట్, బట్టతల టెస్ట్‌ను కేవలం రూ.499లకే నిర్వహించి 24 గంటల్లోనే రిపోర్ట్ ఇస్తారని వెల్లడించారు. 30ఎమ్ జీనోమిక్స్ స్టార్టప్ కంపెనీలో ఉద్యోగాలు పొందిన విద్యార్థులకు నియామక పత్రాలను అందజేశారు. 30ఎమ్ జీనోమిక్స్ స్టార్టప్ కంపెనీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ బెన్నెట్ బాస్కోదాస్, రిజిస్ట్రార్ రఘునాథన్ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం లారీ స్వాధీనం

పొన్నూరు: మండలంలోని ఉప్పరపాలెం నుంచి అక్రమంగా తరలి వెళుతున్న రేషన్ బియ్యం లారీని రూరల్ పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. స్థానికుల నుంచి వచ్చిన సమాచారం మేరకు రూరల్ ఎస్ఐ కిరణ్, తమ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని పీడీఎస్ బియ్యం లారీతో పాటు ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. రూరల్ పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ కోటేశ్వరరావు కేసు వివరాలు తెలిపారు. స్వాధీనం చేసుకున్న లారీలో 75 బస్తాలు, సుమారు 30 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉన్నట్లు తెలిపారు. అక్రమంగా బియ్యం తరలింపులో పొన్నూరుకు చెందిన మురళీకృష్ణ, తాళ్లపాలేనికి చెందిన పోకల శ్రీనివాసరావు, ఉప్పరపాలేనికి చెందిన తాడిశెట్టి నాగేశ్వరరావు ప్రమేయం ఉన్నట్లు తమ విచారణలో తేలిందని వెల్లడించారు. వారిలో లారీ డ్రైవర్ మురళీకృష్ణను అదుపులోకి తీసుకున్నామని మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యాన్ని పౌరసరఫరాల అధికారులకు అప్పగించనున్నట్లు తెలిపారు. ఇకపై రేషన్ బియ్యం అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోనున్నట్లు సీఐ కోటేశ్వరరావు హెచ్చరించారు.